చెత్తనూ వదల్లేదు!

- బెంగళూరులో ఇకపై చెత్త పన్ను
- యూజర్ చార్జీల పేరిట కాంగ్రెస్ సర్కారు మరో భారం

బెంగళూరు, ఏప్రిల్ 1: కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు రోజుకో పన్నుతో ప్రజలను హడలెత్తిస్తున్నది. కాదేదీ పన్నుకు అనర్హం అన్నట్టుగా ప్రతిదానిపైనా ట్యాక్స్ విధిస్తున్నది. చివరకు చెత్తను కూడా వదల్లేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ, మెట్రో, వాహన రిజిస్ట్రేషన్, పాలు, పెరుగు, విద్యుత్ చార్జీలు, వాటర్, స్టాంప్ డ్యూటీ, ఎక్సైజ్ డ్యూటీ, టోల్ పేషంట్ ఫీజులు, పోస్ట్-మార్టమ్ ఎగ్జామినేషన్ చార్జీలు, మెడికల్ సర్టిఫికెట్ ఫీజులు పెంచి ప్రజలపై భారం మోపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు చెత్తపైనా పన్ను విధించింది. వ్యర్థాల నిర్వహణ కోసం బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించింది. వ్యర్థాల సేకరణ కోసం ఏప్రిల్ 1 నుంచి యూజర్ చార్జీలను వసూలు చేయనున్నట్టు ప్రకటించింది. నివాసిత భవనం విస్తీర్ణం ఆధారంగా వీటి చార్జీలను నిర్ణయించింది. 600 చ.అడుగులు లోపు విస్తీర్ణం గల నివాస భవనాలకు ప్రతి గృహం నుంచి నెలకు రూ.10 (ఏడాదికి రూ. 120) యూజర్ చార్జీలుగా వసూలు చేస్తారు. అలాగే 4,000 చ.అడుగులు, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం గల భవనాలకు ప్రతి ఇంటికి నెలకు రూ.400 (ఏడాదికి 4,800) వసూలు చేస్తారు. వాణిజ్య భవనాలకు కేజీకి రూ.12 వంతున తీసుకుంటారు.

ధరల పెంపు దయ్యంలా కాంగ్రెస్ సర్కార్

అన్ని చార్జీలను పెంచుతూ ప్రజల రక్తం తాగుతున్న సిద్ధరామయ్య సర్కార్ 'ధరల పెంపు దయ్యం'లా మారిందని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించారు. కాంగ్రెస్ కంపెనీ మంగళవారం నుంచి చెత్తపై పన్ను విధించిందని, అది ప్రజల రక్తాన్ని తాగుతున్నదని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన గతంలో దేశాన్ని పాలించిన ఈస్టిండియా కంపెనీ తరహాలో ఉందని అన్నారు. ఐదు గ్యారెంటీల అమలు నెపంతో సిద్ధరామయ్య ప్రభుత్వం అన్నింటి ధరలను పెంచుకుంటూ పోతున్నదని, ఇది ప్రజలను దోచుకోవడమేనని అన్నారు. భారత్‌ను ఆక్రమించి నిరంతరం దోచుకున్న గజినీ మహ్మద్, మహమ్మద్ గోరీలు కూడా సిద్ధరామయ్య ప్రభుత్వ దోపిడీని చూసి సిగ్గుపడతారని అన్నారు.

డీజిల్‌పై లీటర్‌కు రూ.2 పెంపు

సిద్ధరామయ్య సర్కారు మరోసారి ఇంధన ధరలు పెంచింది. డీజిల్‌పై లీటర్‌కు రూ.2 పెంచుతున్నట్టు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. డీజిల్‌పై ఇప్పటివరకు విధిస్తున్న కర్ణాటక సేల్స్ ట్యాక్స్‌ను 18.4 శాతం నుంచి 21.17 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపుతో కర్ణాటకలో లీటర్ డీజిల్ ధర రూ.91.02కు చేరుకుంది. డీజిల్ చార్జీలు పెంపుతో రైతులు, రవాణా ఆపరేటర్లు, డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇంధన ధర పెంపు ప్రభావం అన్ని రంగాలపై పడుతుందని, తద్వారా వాటి ధరలు కూడా పెరుగుతాయని పౌరులు ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితమే పాలు లీటర్ ధరను రూ.4 పెంచిన సిద్ధరామయ్య ప్రభుత్వం తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నది.

భారీగా పెరిగిన బ్రిటన్ వీసా ఫీజులు

న్యూఢిల్లీ: బ్రిటన్ వీసా ఫీజులు భారీగా పెరిగాయి. ఈ నెల 1 నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి. దీంతో యూకే పర్యటన మరింత భారం కానున్నది. 6 నెలల వీసాగా పిలుచుకునే స్టాండర్డ్ యూకే విజిటర్ వీసా ఫీజు రూ.12,190 నుంచి రూ.13,462కు, లాంగ్‌టెర్మ్ విజిటర్ వీసా ఫీజు రూ.45,792కు పెరిగాయి. అలాగే ఐదేండ్లు (రూ.81,726), పదేండ్ల (రూ.1.02లక్షలు) వీసా ఫీజుల్ని కూడా యూకే భారీగా పెంచింది. వీసా లేకుండా దేశంలోకి ప్రవేశం కల్పించే ఈటీఏ ఫీజును రూ.1,060 నుంచి 1,696కు పెంచింది. ఈ సదుపాయాన్ని కొన్ని దేశాలకు మాత్రమే పరిమితం చేసింది. వ్యాపారం నిమిత్తం, కుటుంబ సభ్యుల్ని కలుసుకునేందుకు, సెలవుల్ని గడిపేందుకు భారతీయులు ఎక్కువ సంఖ్యలో యూకేలో పర్యటిస్తుంటారు.

వాణిజ్య సిలిండర్‌పై రూ.41 తగ్గింపు

న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లలో వాడే వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గాయి. సవరించిన చార్జీల ప్రకారం 19 కేజీల సిలిండర్ ధర రూ.41 తగ్గింది. దీంతో వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,762, ముంబైలో 1,713.50, చెన్నైలో 1,921.50 రూపాయలకు చేరింది. గృహావసరాలకు వాడే గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. అలాగే విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధర కిలోలీటర్‌కు 6.15 శాతం చొప్పున రూ.5,870.54 తగ్గింది. ధరల సవరణ అనంతరం ఏటీఎఫ్ కిలో లీటర్ ధర ముంబైలో రూ.83,575.42, చెన్నైలో 92,503.80గా ఉంది.

చలాన్ కట్టకుంటే లైసెన్స్ రద్దు!

- 90 రోజుల్లో పెండింగ్ చలాన్లు క్లియర్ చేయాలి
- లేకుంటే డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్
- పెండింగ్ ఈ-చలాన్లకు ఇన్సూరెన్సుతో లింక్
- 3 ట్రాఫిక్ ఉల్లంఘనలకు 3 నెలలు లైసెన్స్ రద్దు
- ఆధునిక టెక్నాలజీతో ట్రాఫిక్ ఉల్లంఘనలపై నిఘా
- ఈ నెల 1 నుంచి అమల్లోకి కొత్త ట్రాఫిక్ నిబంధనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కొత్త ఆర్థిక సంవత్సరం అమలులోకి వచ్చిన నేపథ్యంలో పెండింగ్ ఈ-చలాన్లు ఉన్న వాహనదారులకు ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. తమపై ఉన్న పెండింగ్ జరిమానాలను మూడు నెలల్లో చెల్లించని వారి డ్రైవింగ్ లెసెన్సులు సస్పెండ్ అవుతాయని స్పష్టంచేసింది. దీనికి అదనంగా ఒక ఆర్థిక సంవత్సరంలో మూడు సార్లు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే డ్రైవింగ్ లైసెన్సు కనిష్ఠంగా మూడు నెలల పాటు సస్పెన్షన్‌కు గురవుతుంది. ప్రస్తుతం 40 శాతం మాత్రమే ఉన్న ఈ-చలాన్ రికవరీ రేటును పెంచాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కఠిన చర్యలను తీసుకువచ్చింది. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త నిబంధనలు దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. చెల్లించని ఈ-చలాన్లను వాహన ఇన్సూరెన్సు ప్రీమియంలకు అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఉదాహరణకు గత ఆర్థిక సంవత్సరంలో కనిష్ఠంగా రెండు పెండింగ్ జరిమానాలు ఉన్న డ్రైవర్.. వాహన ఇన్సూరెన్సును ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి ఉంటుంది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘనలను మరింత సమర్థంగా పసిగట్టేందుకు మోటారు వాహనాల చట్టంలోని 136ఏ సెక్షన్ కింద ఆధునిక టెక్నాలజీని అధికారులు ఉపయోగించుకోనున్నారు. ఇందులో సీసీటీవీ కెమెరాలు, స్పీడ్ గన్లు, బాడీ-వార్మ్ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తించే వ్యవస్థలు వంటివి ఉన్నాయి.

ఢిల్లీలో అతి తక్కువ రికవరీ రేటు

జరిమానాల రికవరీలో దేశంలోనే అతి తక్కువగా 14 శాతం రికవరీ రేటును ఢిల్లీ నమోదు చేసుకుంది. దీని తర్వాత స్థానాలలో కర్ణాటక(21 శాతం), తమిళనాడు, ఉత్తరప్రదేశ్(27శాతం చొప్పున), ఒడిశా (29 శాతం) ఉన్నాయి. అత్యధిక రికవరీ రేటు రాష్ట్రాలలో రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా ఉన్నాయి.

ఈ-చలాన్లకు కొత్త ఎస్ఓపీలు

ఈ-చలాన్ జారీ, చెల్లింపుల కోసం కొత్త స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లను(ఎస్ఓపీలు) ప్రభుత్వం ప్రవేశపెట్టింది.. దీని ప్రకారం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన జరిగిన మూడు రోజుల్లోగా ఈ-చలాన్ నోటీసులు డ్రైవర్లకు అందుతాయి. 30 రోజుల్లోగా జరిమానాలు చెల్లించాల్సి ఉంటుంది. లేదా గ్రీవెన్స్ అథారిటీ ఎదుట సవాలు చేయవచ్చు. జరిమానాల చెల్లింపు 90 రోజుల్లోగా జరగని పక్షంలో జరిమానా చెల్లించేంత వరకు డ్రైవింగ్ లైసెన్సు లేదా వాహన రిజిస్ట్రేషన్ సస్పెన్షన్‌లో ఉంటుంది. వాహన డ్రైవర్లు తమ చిరునామా వివరాలను వాహన్, సారథి పోర్టల్స్‌లో మూడు నెలల్లోగా మార్చుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

భారీ జరిమానాలు షురూ

ట్రాఫిక్ ఉల్లంఘనల పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్న ప్రభుత్వం మార్చి 1వ తేదీ నుంచి భారీ జరిమానాల విధింపును అమలులోకి తెచ్చింది. మద్యం తాగి వాహనం నడిపిన వారికి మొదటిసారి పట్టుబడితే రూ. 10,000 జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తోంది. ఒకసారికి మించి అదే నేరానికి పాల్పడితే రూ.15,000 జరిమానా, 2 సంవత్సరాల వరకు కారాగార శిక్షను విధిస్తోంది. ఇది వరకు డ్రంకెన్ డ్రైవింగ్‌కు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు జరిమానా ఉండేది. ఇక హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపిన వారికి రూ.1,000 జరిమానాతోపాటు మూడు నెలలపాటు డ్రైవింగ్ లైసెన్సు సస్పెన్షన్‌ను విధించవచ్చు. కారులో సీటు బెల్టు ధరించని వారు కూడా రూ. 1,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్‌తో డ్రైవింగ్ చేసే వారికి జరిమానాను రూ.5,000కు ప్రభుత్వం పెంచింది.

ప్రతీకారానికి సమయమిదే

- అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ 100% సుంకాలు విధిస్తోంది
- మేం కూడా ప్రతీకార సుంకాలు విధించే సమయం వచ్చింది
- వైట్ హౌస్ సెక్రటరీ లీవిట్ ప్రకటన

వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 1: భారత్‌పై ప్రతీకార సుంకాలకు సమయం ఆసన్నమైందని శ్వేతసౌధం ప్రకటించింది. అమెరికా వస్తువులపై సుంకాలు విధిస్తున్న దేశాలపై అమెరికా విధించనున్న ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2(బుధవారం) నుంచి అమలులోకి రానున్నాయి. అన్యాయంగా సుంకాలు విధిస్తూ అమెరికా ఎగుమతుదారులను దారుణంగా దెబ్బతీస్తున్న దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అమెరికా వ్యవసాయ ఎగుమతులపై భారత్ 100 శాతం సుంకాన్ని విధిస్తోందని, కొన్ని విదేశీ మార్కెట్లను చేరుకోవడానికి అమెరికా వస్తువులకు సాధ్యపడడం లేదని వైట్ హౌస్ సెక్రటరీ కారోలిన్ లీవిట్ పేర్కొన్నారు. ఈ దేశాలు అమెరికాను చాలా ఏళ్లుగా పీల్చి పిప్పి చేస్తున్నాయని ఆమె ఆరోపించారు. అమెరికన్ కార్మికుల పట్ల తమ వ్యతిరేకతను ఈ చర్యలు స్పష్టంగా చూపుతున్నాయని ఆమె తెలిపారు. ప్రతీకారానికి సమయం ఆసన్నమైందని ఆమె ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు చారిత్రాత్మక మార్పులు తీసుకురానున్నారని, బుధవారం అది జరుగుతుందని లీవిట్ తెలిపారు. ఇదిలా ఉండగా, అమెరికా ప్రతీకార సుంకాలు ఏప్రిల్ 2న అమలులోకి వచ్చిన తర్వాత ఆ దేశ వస్తువులపై భారత్ కూడా గణనీయంగా సుంకాలు తగ్గిస్తుందని ట్రంప్ సోమవారం వెల్లడించారు. అమెరికన్ కార్లపై 2.5 శాతం సుంకాన్ని తగ్గిస్తున్నట్టు యూరోపియన్ యూనియన్ రెండు రోజుల క్రితం ప్రకటించిందన్న సంగతి ట్రంప్ గుర్తుచేశారు.

భారత వస్తువుల కొనుగోలుకు సిద్ధం: చైనా

అమెరికా ప్రతీకార సుంకాల్ని విధిస్తున్నవేళ, భారతీయ వస్తువులు మరిన్ని కొనుగోలు చేసేందుకు చైనా సిద్ధమని చైనా రాయబారి యూ ఫీహాంగ్ వెల్లడించారు. వాణిజ్యం, ఇతర రంగాలలో ఆచరణాత్మక సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు భారత్‌తో కలసి పనిచేసేందుకు చైనా సిద్ధమని ఆయన చెప్పారు. చైనా మార్కెట్‌కు అనుకూలంగా ఉండే మరిన్ని భారత వస్తువులను దిగుమతి చేసుకుంటామని అన్నారు.

పెరిగిన 900 ఔషధ ధరలు

- జాబితాలో డయాబెటిస్, గుండెజబ్బుల మందులు

న్యూఢిల్లీ: దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు పెరిగినట్టు నేషనల్ ఫార్మాస్యుటికల్ ప్రైజింగ్ అథారిటీ ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఇన్ఫెక్షన్లు, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి వ్యాధుల చికిత్స కోసం ఉపయోగించే ఔషధాలు, పెయిన్ కిల్లర్లు ధరలు 1.74 శాతం పెరిగాయి. టోకు ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా తయారీదారులు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఔషధాల ధరలను సవరించవచ్చు.

హైవేపై అడుగుపెడితే బాదుడే

దేశవ్యాప్తంగా 4-5 శాతం పెరిగిన టోల్ చార్జీలు ■ ఈ నెల 1 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ: దేశంలోని పలు ప్రాంతాలను సందర్శించాలనుకుంటున్నారా? అయితే కచ్చితంగా మీ బడ్జెట్ పెంచుకోండి. ఎందుకంటే దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై టోల్ చార్జీలు సగటున 4 నుంచి 5 శాతం పెరిగాయి. సవరించిన టోల్ చార్జీలు మంగళవారం నుంచి అమలులోకి వచ్చాయి. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలపై టోల్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం నోటిఫికేషన్‌లు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 855 టోల్ ప్లాజాల్లో 675 ప్రభుత్వ నిధులతో నడుస్తుండగా, 180 ప్రైవేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పెంచిన టోల్ చార్జీలు పలు ప్రధాన రూట్లపై ప్రభావం చూపనున్నాయి. ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, ఈస్టర్న్ పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్ వే, ఢిల్లీ-జైపూర్ జాతీయ రహదారి తదితర రూట్లలో ప్రయాణించే వారిపై ఎక్కువ ప్రభావం పడనుంది. ఈ మార్గాల్లో నిత్యం ప్రయాణించే వారు, పర్యాటకులపై చార్జీల భారం పడుతుంది. తద్వారా రవాణా చార్జీలు కూడా త్వరలో పెరగనున్నాయి.

600 మంది ఉద్యోగులపై జొమాటో వేటు!

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో తన కస్టమర్ సపోర్ట్ అసోసియేట్స్ సిబ్బందిలో 600 మందిని తొలగించిందని బాధిత ఉద్యోగులు వెల్లడించారు. వ్యాపారంలో వృద్ధి రేటు పడిపోవడం, క్విక్ కామర్స్ విభాగమైన బ్లింక్‌ఇట్‌లో నష్టాలు రావడంతో ఆ కంపెనీ ఈ చర్యలకు పాల్పడినట్టు తెలుస్తున్నది. కృత్రిమ మేధను విరివిగా ఉపయోగించడం కూడా ఉద్యోగాల కోతకు ఒక కారణంగా తెలుస్తున్నది. అయితే ఉద్యోగుల తొలగింపుపై జొమాటో ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. నిరుడు కస్టమర్ సపోర్ట్ రోల్స్, సేల్స్, ఆపరేషన్స్ తదితర అవసరాల కోసం జొమాటో 1500 మంది ఉద్యోగులను ఒక సంవత్సరానికి గాను కాంట్రాక్ట్ ప్రతిపాదికన నియమించుకొంది. ఇందులో చాలా మందికి ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఒక నెల జీతం ఇచ్చి తొలగించినట్లు సమాచారం.

చారిటీలకు రూ.3,800 కోట్లు

- దాతృత్వానికి మరో పేరుగా పారిశ్రామిక వేత్త రతన్ టాటా
- మరణానంతరమూ ఆ వారసత్వం కొనసాగింపు
- వీలునామాలో అత్యధికం సేవా సంస్థలకే కేటాయింపు
- స్నేహితులను, పెంపుడు జంతువులను మరిచిపోని మానవతామూర్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: లక్షల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్వహించిన దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా తాను జీవించినంత కాలం మానవతామూర్తిగా, దాతృత్వానికి మారుపేరుగా నిలిచారు. ఆయన దాతృత్వం ఖండాంతరాలలో ఖ్యాతిని తెచ్చింది. ఆయన ఉన్నప్పుడే కాదు లేనప్పుడు కూడా దాతృత్వం తన శాశ్వత వారసత్వంగా నిలిచిపోయింది. తన తదనంతరం సంపదలో అత్యధిక వాటాను దాతృత్వానికే కేటాయించారు. ఈ మేరకు ఆయన వీలునామా రాసిపెట్టినట్టు ఒక ఆంగ్ల దినపత్రిక మంగళవారం వెల్లడించింది. రతన్ టాటా నిరుడు అక్టోబర్ 9న కన్నుమూశారు. తన సంపదలో అత్యధికంగా తాను నెలకొల్పిన చారిటీలు, ట్రస్ట్‌లు, ఫౌండేషన్‌లకు కేటాయించినప్పటికీ కుటుంబ సభ్యులను, స్నేహితులను, పెంపుడు జంతువులను ఆయన మరిచిపోలేదు. ఇక తన విల్లును ఎవరైనా సవాలు చేస్తే వారికి ఎటువంటి హక్కులు లేదా వాటా కూడా లభించబోదు అని కూడా ఆయన షరతు విధించారు. రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్ట్‌కు రూ.3,800 కోట్ల విలువైన సంపదను ఆయన కేటాయించారు. ఈ రెండు దాతృత్వ సంస్థలు కాగా, అవి తమకు లభించిన నిధులను దాతృత్వ ప్రయోజనాలకు ఉపయోగించాలి. ఇక తన సవతి సోదరీమణులు షిరీన్ జెజీభోయ్, డియానా జెజీభోయ్‌లకు రూ.800 కోట్ల విలువైన బ్యాంక్ డిపాజిట్లు, స్టాక్స్, ఇతర విలువైన వస్తువులను అందించాలని తన వీలునామాలో పేర్కొన్నారు. తన సోదరుడు 82 ఏండ్ల జిమ్మీ నావల్ టాటాకు జుహు బంగళాలో కొంత వాటా, వెండి వస్తువులు, కొన్ని ఆభరణాలను అందించాలని తెలిపారు. తన సన్నిహిత మిత్రుడు మెహ్లీ మిస్త్రీకి అలీబాగ్ ఆస్తులు, మూడు తుపాకులు అందించారు. జంతువుల పట్ల రతన్‌కున్న ప్రేమ అందరికీ తెలిసిందే. ఆయన వాటి కోసం దవాఖానలనే నెలకొల్పారు. వాటి కోసం ఆయన రూ.12 లక్షల నిధిని ఏర్పరిచారు. వీటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒక సారి వాటి సంరక్షణ కోసం ఒక్కో జంతువుకు రూ.30 వేలు ఖర్చు చేయాలని సూచించారు. తనకు చివరి దశలో స్నేహితునిగా, మేనేజర్‌గా వ్యవహరించిన శంతను నాయుడుకు ఇచ్చిన విద్యా రుణాన్ని మాఫీ చేశారు. తన ఇంటికి పొరుగున ఉన్న జేక్ మాలైట్‌కు ఇచ్చిన విద్యా రుణాన్ని కూడా ఆయన రద్దు చేశారు.

పేలిన పైపులైన్.. ఎగిసిన అగ్నికీలలు

కౌలాలంపూర్: మలేషియాలోని కౌలాలంపూర్ వెలుపల చోటుచేసుకున్న భారీ అగ్ని ప్రమాదంతో ఆకాశంలోకి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. సుమారు 20 అంతస్తుల ఎత్తులో ఉవ్వెత్తున మంటలు చెలరేగాయి. పరిసర ప్రాంతాలలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ ప్రమాదంలో 145 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా 190 ఇండ్లు, 148 కార్లు ధ్వంసమైనట్టు అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

పటాకుల గోదాములో పేలుడు.. 21 మంది దుర్మరణం

గుజరాత్‌లో ఘోర అగ్ని ప్రమాదం

అహ్మదాబాద్: గుజరాత్‌లోని దీసా పట్టణానికి సమీపంలోని పటాకుల గోదాములో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన 21 మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు దుర్మరణం చెందగా, ఆరుగురు గాయపడ్డారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం బాయిలర్ పేలడంతో గోదాము పైకప్పు, కొన్ని గోడలు కూలిపోయాయని జిల్లా ఎస్పీ తెలిపారు. అగ్నిమాపక శాఖ వెంటనే మంటలను అదుపు చేసిందని చెప్పారు. మృతుల కుటుంబాలకు గుజరాత్ సీఎం రూ.4 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

నేడు లోక్‌సభలో వక్ఫ్ బిల్లుపై చర్చ

8 గంటల సమయం కేటాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: వివాదాస్పద వక్ఫ్(సవరణ) బిల్లుపై బుధవారం లోక్‌సభలో చర్చ జరగనున్నది. ఈ బిల్లును ఎట్టి పరిస్థితిలో ఇదే సమావేశంలో ఆమోదించాలని అధికార పక్షం భావిస్తుండగా రాజ్యాంగ విరుద్ధమైన ఈ బిల్లును సమైక్యంగా వ్యతిరేకించాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయి. స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన ప్రధాన పార్టీలకు చెందిన నాయకులతో కూడిన లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) మంగళవారం సమావేశమై వక్ఫ్ బిల్లుపై 8 గంటలపాటు చర్చించాలని నిర్ణయించినట్టు మైనారిటీలు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరులకు తెలిపారు. అవసరమైతే సమయాన్ని పొడిగించడానికి కూడా స్పీకర్ అంగీకరించినట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వం తమ గొంతును నులిమివేస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్‌తోపాటు ఇతర ఇండియా కూటమికి చెందిన పార్టీలు సమావేశం నుంచి వాకౌట్ చేయడంతో బుధవారం నాటి లోక్‌సభ సమావేశం వాడీవేడిగా సాగే అవకాశాలు కనపడుతున్నాయి.

పాలిటిక్స్ నా ఫుల్ టైమ్ జాబ్ కాదు

- యూపీ స్కూళ్లలో తెలుగు, తమిళం బోధిస్తున్నాం
- పీటీఐ ఇంటర్వ్యూలో యూపీ సీఎం యోగి

లక్నో: రాజకీయాలు తనకు పూర్తి కాల ఉద్యోగం కాదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. అంతిమంగా తాను ఒక యోగినేనని ఆయన చెప్పారు. బుధవారం పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. యూపీ అభివృద్ధిలో ముస్లింలు తగిన భాగాన్ని పొందుతారని.. అయితే వాళ్లు మైనారిటీలు అయినందున ప్రత్యేక రాయితీలు వస్తాయని ఆశించొద్దని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డులు సమాజానికి ఏమీ తిరిగివ్వడం లేదని.. చివరికి ముస్లింలకు కూడా అవి ఏమీ ప్రయోజనం చేకూర్చడం లేదని ఆయన విమర్శించారు. తెలుగు, తమిళం, బెంగాలీ లేదా మరాఠీ లాంటి భాషలు దేశ ఐక్యతకు పునాది రాళ్లుగా ఉపయోగపడుతున్నాయన్నారు. తమ రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో ప్రాంతీయ భాషలు బోధిస్తున్నామని చెప్పారు. హిందీ గౌరవం పొందాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని ఆయన తెలిపారు.

ఇండ్ల కూల్చివేత అమానుషం

- ఉత్తరప్రదేశ్ సర్కారు చర్యలపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం
- బీజేపీ సర్కారు తీరు దిగ్భ్రాంతికి గురిచేసిందన్న న్యాయస్థానం
- నివాస భవనాల కూల్చివేత ఫ్యాషన్ కాకూడదని హితవు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇండ్ల కూల్చివేతపై బీజేపీ సర్కారు మీద సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ తీరు అమానుషం, చట్టవిరుద్ధమని పేర్కొంది. బాధిత కుటుంబాలకు ఆరు వారాల్లోగా రూ.10 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కూల్చివేతలు జరిపిన తీరు మా మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురి చేసిందని కోర్టు పేర్కొంది. మున్సిపల్ అధికారులకు సున్నితత్వం కొరవడిందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ తరహాలో కూల్చివేతలు ఫ్యాషన్ కాకూడదని హితవు పలికింది. జరిగిన పరిణామాలను దురదృష్టకరంగా అభివర్ణిస్తూ చట్ట విరుద్ధంగా కూల్చివేతలు జరిగాయని, ఇందులో ప్రమేయం ఉన్నవారికి వాటిని నిర్మించే శక్తి లేదని కోర్టు వ్యాఖ్యానించింది. కూల్చివేతలు ప్రాథమిక హక్కులలో అత్యంత ముఖ్యమైనదైన జీవించే హక్కు పరిధిలోకి వచ్చే గూడు హక్కును కూడా అతిక్రమించారని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. రాజకీయ నాయకుడిగా మారిన గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్‌కు చెందిన స్థలంగా భావించి, 2021లో ప్రభుత్వం తమ ఇండ్లను కూల్చివేసిందని బాధితులు పిటిషన్‌లో పేర్కొన్నారు. వీరిలో ఓ న్యాయవాది, ఓ ప్రొఫెసర్, ఇద్దరు మహిళలు ఉన్నారు. గతంలో కూల్చివేతలపై వీరు వేసిన పిటిషన్లను అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో వీరు సుప్రీంను ఆశ్రయించారు. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం చట్టపరమైన నిబంధనలు పాటించకుండా కూల్చివేతలు కొనసాగించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే కూల్చివేతలు చేపట్టారని, ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు లేదా అప్పీలు చేసుకునే అవకాశాన్ని కూడా బాధితులకు ఇవ్వలేదని కోర్టు మండిపడింది. ఇటీవల ఇండ్ల కూల్చివేతల సందర్భంగా ఓ బాలిక పుస్తకాలు చేత పట్టుకొని పరుగెడుతున్న వీడియోను ప్రస్తావిస్తూ.. ఇది అందరినీ కలచివేసిందని తెలిపింది.

సైఫ్‌పై హత్యాయత్నం కేసు.. హోం శాఖపై పరువు నష్టం దావా

ముంబై, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై హత్య ప్రయత్నం చేశాడని ఆరోపిస్తూ ఆకాశ్ కనోజియా అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసిన కేసులో మహారాష్ట్ర హోం మంత్రిత్వ శాఖపై బాంబే హైకోర్టులో రూ.కోటి పరువు నష్టం దావా దాఖలైంది. అక్రమ కేసు వల్ల ఉద్యోగం, పెళ్లి రెండింటినీ కోల్పోయాడని బాధితుడు పక్షాన ముంబై సామాజిక కార్యకర్త, న్యాయవాది ఫైజాన్ అన్సారీ హైకోర్టును ఆశ్రయించారు. ముంబై పోలీసులు తన అరెస్ట్ వార్తను మీడియాలో ఇవ్వడం, ఫొటో-వీడియోలు మీడియాలో రావడంతో పరువు పోయిందని బాధితుడు పిటిషన్‌లో పేర్కొన్నారు. జనవరి 15 తెల్లవారుజామున 2 గంటలకు ముంబైలోని బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి ప్రవేశించిన దొంగ.. అక్కడ సైఫ్‌పై కత్తిత